సాక్షి రంగారెడ్డి

సోమవారం, 29, జనవరి, 2024



క్వారీలపై హక్కులివ్వాలి

క్వారీలపై పూర్తి హక్కులు వడ్డెర వృత్తిదారులకే ఇవ్వాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్ డిమాండ్ చేశారు. 8లో▸



పేదలకు మేలు

ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ మేలు జరుగుతుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. 8లో▸



కాసులు బాగు

వరికి బదులు రైతులు క్యారెట్ సాగు చేస్తే అన్ని విధాలా లాభదాయకమని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు చేవెళ్లకు కేటీఆర్ రాక

చేవెళ్ల: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం చేవెళ్లకు రానున్నారు. ఈమేరకు పార్టీ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్ వివరాలు వెల్లడించారు. మండలకేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు చేవెళ్ల నియోజకవర్గస్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి కేటీఆర్‌తోపాటు ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు సబితారెడ్డి, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి హాజరవుతారని చెప్పారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

తెలంగాణ రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం: తెలంగాణ రైతు సంఘం 2024 క్యాలెండర్‌ను ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్ రావు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు మారయ్య, మైబెల్లి, ఆ సంఘం మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్యదర్శి ముసలయ్య తదితరులు ఉన్నారు.

వడివడిగా..

సాక్షి, సిటీబ్యూరో: వచ్చే వేసవిలో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చేపట్టిన ముందస్తు లైన్ల పునరుద్ధరణ, నిర్వహణ పనులను వడివడిగా పూర్తి చేస్తోంది. గ్రేటర్ వ్యాప్తంగా 11 కేవీ సబ్‌స్టేషన్లు 364 ఉండగా, వీటిలో ఇప్పటికే 150 సబ్‌స్టేషన్ల పరిధిలో పనులు పూర్తి చేశారు. అదే విధంగా 11 కేవీ ఫీడర్లు 3288 ఉండగా, వీటిలో ఇప్పటికే 2,248 ఫీడర్ల పరిధిలో లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, లూజు లైన్లను సరి చేయడం, ఆయిల్ లీకేజీలను అరికట్టడం, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను, కండక్టర్లు, ఇన్సులేటర్లు, జంపర్లను మార్చడం వంటి పనులు పూర్తి చేసింది. ప్రభుత్వ సెలవులతో సంబంధం లేకుండా విద్యుత్ సిబ్బంది నిరంతరాయంగా పని చేస్తున్నారు. వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా రోజుకు ఒక్కో ఏరియాలో రెండున్నర గంటల చొప్పున ఎల్‌సీ తీసుకుంటున్నారు. ఫిబ్రవరి 10 లోపు మిగిలిన అన్ని ఫీడర్ల పరిధిలోనూ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డైరెక్టర్లు, సీజీఎంలు, ఎస్ఈలు సైతం ఫీల్డ్‌లో పర్యటిస్తుండటం కొసమెరుపు.


ఏడో అంతస్తుపై నుంచి పడి ఏసీ మెకానిక్ మృతి

రాజేంద్రనగర్: ప్రమాదవశాత్తు ఏడో అంతస్తుపై నుంచి పడి ఏసీ ఫిట్టింగ్ మెకానిక్ మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం శివరాంపల్లి ప్రావిడెంట్ అపార్ట్‌మెంట్‌లో 14వ బ్లాక్ ఏడో అంతస్తులో ఏసీ బిగించేందుకు బార్కస్ ప్రాంతానికి చెందిన సమీర్ (26) శనివారం మధ్యాహ్నం వచ్చాడు. మరో మెకానిక్‌తో కలిసి ఏసీ అవుట్ డోర్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిమ్స్ ఆస్పత్రి భవనంపై నుంచి దూకి రోగి ఆత్మహత్య

పంజగుట్ట/లక్డీకాపూల్: అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పంజగుట్ట పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వై.లక్ష్మీపురానికి చెందిన ఆరెంపుల అచ్చయ్య (55) అనారోగ్యంతో ఈ నెల 19న నిమ్స్‌లో చేరాడు. అతడికి వైద్యులు ఆపరేషన్ చేసి 27న స్పెషాలిటీ బ్లాక్ రెండో అంతస్తులోని ఓపీ బ్లాక్‌లో చేర్చి చికిత్స అందిస్తున్నారు. శనివారం రాత్రి 11 గంటలకు అచ్చయ్య భోజనం చేసిన తర్వాత బెడ్‌పై నిద్రపోయాడు. ఆయన కుమారుడు గుర్నాథం కుర్చీపై పడుకున్నాడు. తెల్లవారు జామున 3.15 గంటకుకు గుర్నాథం లేచి చూడగా మంచంపై తండ్రి కనిపించలేదు. వెంటనే వెయిటింగ్ రూం, వాష్ రూంల్లో వెతికినా కనిపించలేదు. కిటికీలోంచి కిందకు చూడగా కొంతమంది దూకొద్దు అని అరుస్తుండటాన్ని గమనించాడు. అతను కిందకు వెళ్లేలోగా తండ్రి కిందకు దూకేశాడు. రక్తపు మడుగులో పడి ఉన్న అచ్చయ్యను నిమ్స్ సెక్యూరిటీ సిబ్బందితో కలిసి అత్యవసర విభాగానికి తరలించారు. వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకుండాపోయింది. ఉదయం 5.30 గంటలకు అచ్చయ్య మృతి చెందాడు. కుమారుడు గుర్నాథం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నేతల చూపు 'హస్తం' వైపు!



నిన్న మాజీ ఎమ్మెల్యే.. నేడు ఎమ్మెల్యే

- వరుసగా సీఎంను కలుస్తున్న బీఆర్‌ఎస్ నేతలు
- రెండు రోజుల క్రితం కలిసిన మాజీ ఎమ్మెల్యే తీగల
- తాజాగా భేటీ అయిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్
- లోక్‌సభ ఎన్నికల వేళ చర్చనీయాంశంగా నేతల తీరు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బీఆర్‌ఎస్ నేతలు ఆ పార్టీ అధిష్టానానికి షాక్‌ల మీద షాకులిస్తున్నారు. ఒకవైపు లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతుండగా, మరోవైపు జిల్లాలోని పలువురు నేతలు పార్టీని వీడేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలవగా, తాజాగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జిల్లా రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆ పార్టీ అధిష్టానానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరి దారిలోనే మరికొంత మంది నేతలు కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

షాక్‌ల మీద షాక్‌లు

ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో 17 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వీటిలో ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మల్కాజ్‌గిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, చేవెళ్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించగా, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. చేవెళ్లలో స్వల్ప మెజార్టీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపొందారు. మెజార్టీ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందినప్పటికీ.. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగింది. పరాజయంతో బీఆర్‌ఎస్ తన అధికారాన్ని కోల్పోగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలోని పలువురు కీలక (గతంలో కాంగ్రెస్ నుంచి గెలుపొంది ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరిన నేతలు) ప్రజాప్రతినిధులు ఆయన టచ్‌లోకి వెళ్లినట్లు ప్రచారం జరిగింది. వారు బీఆర్‌ఎస్‌ను వీడి, కాంగ్రెస్‌లోకి చేరేందుకు సుముఖంగా ఉన్నప్పటికీ.. పార్టీ హైకమాండ్ ఇందుకు నిరాకరించడంతో వారంతా అక్కడే ఉండిపోయారు. గతంలో కాంగ్రెస్‌ను వీడిన వారు కాకుండా ఇతరులను పార్టీలోకి చేర్చుకోవాలనే యోచనలో హైకమాండ్ ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు రాజకీయ పలుకుబడి, సంస్థాగతంగా ప్రజల్లో మంచి గుర్తింపు ఉన్న నేతలను తమ గూటికి రప్పించే పనిలో నిమగ్నమైంది. ఇతర పార్టీల నుంచి వచ్చే నేతలను చేర్చుకునే విషయంలో పార్టీ హైకమాండ్ ఆచితూచి వ్యవహరిస్తోంది. మాజీ ఎమ్మెల్యే తీగల బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమైనట్లు సమాచారం.

గులాబీ అధిష్టానం ఉక్కిరిబిక్కిరి

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఇటీవల శాసన మండలి మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు స్వామిగౌడ్ నివాసానికి వెళ్లారు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నివాసానికి చేరుకున్నారు. గౌడ సంక్షేమ భవనం నిర్మాణం నేపథ్యంలోనే తమ భేటీ జరిగినట్లు అప్పట్లో వారు ప్రకటించారు. అప్పటికే పొన్నం వారిద్దరినీ పార్టీలోకి ఆహ్వానించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తాజాగా ప్రకాష్‌గౌడ్ సీఎం రేవంత్‌ను కలవడం, సలహాదారు వేంనరేందర్ రెడ్డి ఆయనకు కండువా (మూడు రంగుల) కప్పడం, ఆ వీడియో సోషల్ మీడియా లో చక్కర్లు కొట్టడం ఇటు బీఆర్‌ఎస్‌లోనే కాకుండా అటు కాంగ్రెస్‌లోనూ చర్చనీయాంశమైంది. అయితే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరినట్లు సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. మర్యాద పూర్వకంగా సీఎంను కలిసినట్లు ప్రకటించారు. శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ, బహదూర్‌గూడ, ఘన్సిమియాగూడాలో పలు భూములకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని, వాటికి పరిష్కార మార్గం చూపించాలని, నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సీఎంను అభ్యర్థించగా, ఇందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వస్తున్నా వార్తల్లో ఏ మాత్రం నిజం లేదన్నారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలోని పలువురు ముఖ్య నేతలు తరచూ అధికార కాంగ్రెస్‌తో టచ్‌లోకి వెళ్తుండటాన్ని బీఆర్‌ఎస్ అధిష్టానం జీర్ణించుకోలేకపోతోంది.









ముగిసిన 'కామిక్‌కాన్'

మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన హైదరాబాద్ కామిక్ కాన్ ఆదివారం ముగిసింది. కార్యక్రమంలో భాగంగా సినీనటుడు రానా దగ్గుబాటి పాల్గొన్నారు. దేవతామూర్తుల కార్టూన్లతో రూపొందించిన 'దేవాస్' కథల సంపుటిని ఆయన ఆవిష్కరించారు. యువత వివిధ వేషధారణలతో సందర్శకులను ఆకట్టుకున్నారు.

– మాదాపూర్





మనసు దోచిన సాహితీ పండగ

- సాహిత్యోత్సవం.. ఆద్యంతం రసరమ్యం
- అట్టహాసంగా ముగిసిన 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్'

హఫీజ్‌పేట్: సాహిత్యం, సందేశం, సామాజిక అంశాలతో 3 రోజులపాటు వైభవంగా నిర్వహించిన 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్' ఆదివారం అట్టహాసంగా ముగిసింది. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని సత్వా వేదికగా కొనసాగిన సాహితోత్సవం చివరి రోజైన ఆదివారం సాహిత్యాభిలాషులతో నిండిపోయింది. హైదరాబాద్ లిటరరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ముఖ్యంగా సాహిత్యం, కళలు, పర్యావరణం, సంస్కృతి, ఆధ్యాత్మికతను చాటి చెప్పింది.

- సాహిత్యం, కళలు, సామాజిక అంశాలతో విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులను, ఔత్సాహికులను భాగస్వాములను చేయడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. పలు అంశాలపై చర్చాగోష్టులు వంటి వాటితో పాటు పుస్తక పరిచయాలు, స్వచ్ఛంద, పర్యావరణ, ఆధ్యాత్మిక, పుస్తక ప్రదర్శన, చేనేత వస్త్ర సంస్థల స్టాళ్లు ఒకేచోట ఏర్పాటు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. సేవ్ రాక్స్, మర్రి చెట్లు, పచ్చదనంపై వేసిన నాటక ప్రదర్శన చూపరులను ఇట్టే కట్టిపడేశాయి. ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా గ్రంథాలయాలను ఏర్పాటు చేసే 'ఫుడ్ ఫర్ థాట్' అనే స్వచ్ఛంద స్టాల్ సందర్శకులను ఆకట్టుకుంది. ఇందులో చేనేత వస్త్రాల స్టాళ్లు ప్రత్యేకంగా నిలిచాయి. 'సేవ్ రాక్స్' పేరిట సొసైటీ ఫర్ సేవ్ రాక్స్ సంస్థ వచ్చిన వారికి రాక్స్ టాటూస్ వేసి అందరికీ అవగాహన కల్పించారు. హెచ్‌సీఎస్‌సీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సమస్యలపై అందరికీ బ్రోచర్లు పంపిణీ చేసి అవగాహన కల్పించారు.

పాత ఫొటోలపై చేతితో ఎంబ్రాయిడరీ..

నగరానికి చెందిన రుక్మిణీ గత 50 సంవత్సరాల నాటి ఫొటోపై చేతితో ఎంబ్రాయిడరీ, పెయింటింగ్ వేసి పాత కొత్తగా రూపుదిద్దుతున్నారు. పీవీ నరసింహారావు, సమ్మక్క సారక్క తదితర ఫొటోలకు ఎంబ్రాయిడరీ, పెయింటింగ్ వేసి సందర్శకులను ఆకట్టుకున్నారు.

ఆకట్టుకున్న చేనేత వస్త్రాలు..

టీఎస్‌సీఓ ఆధ్వర్యంలో స్టాళ్లలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. గొల్లభామ చీరలు, పోచంపల్లి, గద్వాల్, నారాయణ్‌పేట్, కరీంనగర్ బెడ్ షీట్లు, సిద్దిపేట టవళ్లు, దుబ్బాక, రాజోలీ తదితర ప్రాంతాలలో వేసిన చేనేత చీరలు సందర్శకులను అలరించాయి.

సొసైటీ టు సేవ్ రాక్స్..

నగరంలో పురాతన రాతి సంపదను రోడ్డు విస్తరణలో, బ్యూటిఫికేషన్‌లో భాగంగా తొలగిస్తున్నారు. ప్రకృతి వనంగా ఉన్న రాక్స్‌ను కాపాడటం కోసం 30 ఏళ్ల క్రితం సొసైటీ టు సేవ్ రాక్స్ స్థాపించామని ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం చెరువులు, గుట్టలు కనుమరుగవుతున్నాయి. సేవ్ రాక్స్ పేరిట ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్‌లో 26 సైట్లను రక్షించినట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. హెచ్‌సీయూ, మనూ యూనివర్సిటీల్లో కొన్ని రాక్స్‌ను కాపాడినట్లు పేర్కొన్నారు.

మిస్టరీ నవల ఆవిష్కరణ..

ఆనంద తుమ్మగోటి రచించిన 'గ్రీన్ అలిబగియోంట్స్ అండ్ ది సీక్రెట్ ఆఫ్ ది పాయిజన్ గార్డెన్' నవలను హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో భాగంగా గ్రాన్యుల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి ఆవిష్కరించారు.



ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

చేవెళ్ల: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కోశాధికారిటి. లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని మారిక హైస్కూల్‌లో ఆదివారం జిల్లా కమిటీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఐదేళ్లుగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టలేదని.. వెంటనే వాటిని చేపట్టాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎరుపుల గాలయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యారంగ సమస్యల పరిష్కారంపై చొరవ తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ మాట్లాడుతూ.. జీఓ 317 ద్వారా నష్టపోయిన వారికి స్థానిక జిల్లాలో సూపర్ న్యూమరీ పోస్టుల ద్వారా వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధుల సిఫార్సులకు అనుగుణంగా జిల్లాకు అక్రమంగా వచ్చిన ఇతర జిల్లాల ఉపాధ్యాయులను తిరిగి వారి సొంత జిల్లాలకు పంపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, ఆడిట్ కమిటీ చైర్మన్ రఘుపాల్, జిల్లా కార్యదర్శులు, జిల్లాలోని 27 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇక పక్కాగా.. ఎరువుల లెక్క



- కొరతకు చెక్ పెట్టేందుకు కొత్త యాప్
- ఫైవ్ యాప్ అందుబాటులోకి తెచ్చిన వ్యవసాయశాఖ
- డీలర్లు నమోదు చేసేలా చర్యలు
- నిల్వలపై ఎప్పటికప్పుడు అధికారుల నిఘా

షాద్‌నగర్: ఎరువుల నిల్వలను కచ్చితంగా తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. పారదర్శకంగా రైతులకు విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు గాను ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం (ఫైవ్) పేరిట కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎరువుల కొరతకు చెక్ పెట్టడమే కాకుండా, నిల్వలపై ఎప్పటికప్పుడు అధికారులు నిఘా ఉంచేందుకు ఇది తోడ్పడనుంది.

పక్కదారి పట్టకుండా..

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతులకు రాయితీపై ఎరువులను అందిస్తోంది. చాలా ప్రాంతాల్లో డీలర్లు ఎరువులను పక్కదారి పట్టించి అక్రమాలకు పాల్పడుతున్నారు. వానాకాలం, యాసంగి పంటల సీజన్లలో ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఫలితంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఎరువుల సరఫరాలో పారదర్శకతను మరింత పెంచేందుకు వ్యవసాయశాఖ కొత్త యాప్‌నకు రూపకల్పన చేసింది.

అధికారుల తనిఖీలు

పరిశ్రమల నుంచి వచ్చిన ఎరువులను అధికారులు ధ్రువీకరించడంతో పాటు నిల్వలు, విక్రయాలు ఈ పాస్ ద్వారా జరుగుతున్నాయా లేదా అనేది అధికారులు పర్యవేక్షిస్తారు. పంటల నమోదులాగే ఇక నుంచి ఎరువుల దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సంబంధిత డీలర్ ఎరువులను ఈ పాస్ ద్వారా విక్రయిస్తున్నారా లేదా అనేది తనిఖీ చేస్తారు. వారంలో రెండు రోజుల పాటు వ్యవసాయ అధికారులు ఎరువుల దుకాణాలను వెళ్లి క్షుణ్ణంగా పరిశీలిస్తారు. సరఫరాలో ఎక్కడ తేడా వచ్చినా సదరు డీలర్లపై చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది. ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం దుకాణాల నిర్వహణ ఉందా లేదా అనేది తనిఖీల ద్వారా తెలుస్తుంది.

ఆన్‌లైన్‌లో నమోదు

డీలర్లు ఎప్పటికప్పుడు ఎరువుల క్రయవిక్రయాలకు సంబంధించిన పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేయడంతోపాటు ఈ - పాస్ యంత్రాలు తప్పనిసరిగా వినియోగించాల్సి ఉంటుంది. ప్రతి డీలరు తమ దుకాణాల్లో చూపే నిల్వలు ఈ పాస్‌లో చూపించే నిల్వలతో సమానంగా ఉండాలి. విక్రయించిన రైతుల వివరాలతో పాటు రిజిస్టర్‌లో సంతకాలు చేసి వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

తొలగనున్న ఇబ్బందులు

యాసంగి, వానాకాలం సీజన్‌లో రైతులు ఎక్కువగా డీఏపీ, యూరియాను వినియోగిస్తారు. కొత్తగా తీసుకొచ్చిన యాప్‌తో ఎరువుల దుకాణాల్లో ఉండే నిల్వల వివరాలు ఎప్పడికప్పుడు అధికారులు తెలుసుకునే వీలుంటుంది. ఎరువుల నిల్వలపై కచ్చితమైన లెక్కలు ప్రభుత్వం వద్ద ఉంటాయి. నిల్వలు సరిపడా లేకపోతే వెంటనే సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుంది. దీంతో రైతులకు ఎరువుల కొరత సమస్య ఉండదు.

మరింత పారదర్శకత



కొత్త విధానంతో ఎరువుల విక్రయాల్లో మరింత పారదర్శకత పెరుగుతుంది. నిల్వలపై ప్రభుత్వం వద్ద సమాచారం ఉంటుంది. రైతులకు కొరత అనే సమస్య ఉండదు.

– నిషాంత్‌కుమార్, ఏఓ, షాద్‌నగర్

నిబంధనలు మీరితే చర్యలు



పారదర్శకంగా ఎరువుల సరఫరా కోసం ప్రభుత్వం ఫైవ్ యాప్‌ను అమల్లోకి తెచ్చింది. ఈపాస్ యంత్రాలతో డీలర్లు ఎరువు లను విక్రయించాలి. నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు, చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారిణి

మట్టి తరలిస్తున్న వాహనాల పట్టివేత

కేశంపేట: మండలంలోని సంగెం గ్రామ శివారులో పోల్కోనిగుట్టతండా గ్రామ పంచాయతీ పరిధిలో ఓ రైతు వ్యవసాయ భూమి నుంచి మట్టిని తరలిస్తుండగా పోలీసులు ఆదివారం రాత్రి అడ్డుకున్నారు. మట్టి తరలించేందుకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

క్యారెట్ సాగు.. కాసులు బాగు!


సాగు చేసిన క్యారెట్ పంట

వరికి ప్రత్యామ్నాయంగా దుంప సేద్యం

- నల్ల రేగడి నేలలు అనుకూలం
- చేవెళ్ల డివిజన్ ఉద్యానశాఖ అధికారి అశోక్



షాబాద్: జిల్లాలో నల్ల, ఎర్ర, మసక నేలలు విస్తారంగా ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో బోర్లు, బావుల కింద వరి పంట సాగు చేస్తున్నారు. కానీ, వరికి బదులుగా రైతులు క్యారెట్ పంటను సాగు చేస్తే అన్ని విధాల లాభదాయకంగా ఉంటుంది. క్యారెట్‌తో మంచి లాభాలు ఉంటాయని చేవెళ్ల డివిజన్ ఉద్యానశాఖ అధికారి అశోక్ రైతులకు సూచిస్తున్నారు. క్యారెట్ సాగు వివరాలను రైతులకు ఇలా వివరించారు.

పొలం తయారీ

పొలాన్ని దుక్కి చేసి సిఫార్సు చేసిన ఎరువులను వేసి పొలం మెత్తగా ఉండేటట్లు చూడాలి. చిన్న చిన్న మడులుగా చేసుకుని 25 సెంటీమీటర్ల దూరంలో బోదెలు వేసుకొని పంట సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకోవాలి.

విత్తనాల రకాలు

కరోడ, పూసా కేసర్, పూసా మయదగ్ని, నాంటెస్ ఇండియా గోల్డ్ ఈ రకాలను పంట సాగుకు ఉపయోగించవచ్చు. ఫలితంగా 100 నుంచి 120 రోజుల్లోగా పంట చేతికొస్తుంది. ఎకరానికి 3 కిలోల విత్తనం సరిపోతుంది.

ఎరువుల వాడకం

ఎకరానికి 4 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు, యురియా 40 కిలోలు, ఎస్ఎస్‌పీ(సూపర్) 110 కిలోలు, పొటాష్ 60 కిలోలు, సూపర్ మొత్తం 110 కిలోలు వాడాలి. ఆఖరి దుక్కిలో పొటాష్ 60 కిలోలు, యూరియా 20 కిలోలు వేయాలి. మిగతా 20 కిలోల యూరియా పంట 40 నుంచి 45 రోజుల్లో పైపాటుగా వేయాలి. దుంప ఊరే సమయంలో 13:0:45ను 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి ఎకరానికి కిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.

కలుపు నివారణ

విత్తనం వేసిన రెండు రోజుల్లో పెండి మిథనాల్‌ను ఒక లీటరు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. 25 రోజుల తర్వాత మెట్రిబుజిన్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

నీటి తడులు

8 నుంచి 15 రోజుల వ్యవధిలో నీరు పెట్టాలి. డ్రిప్, ఎత్తైన మడుల ద్వారా నీరందిస్తే నాణ్యత గల దుంపలతో అధిక దిగుబడి పొందవచ్చు.

సస్యరక్షణ చర్యలు

ఈ పంటలో సస్యరక్షణ చాలా తక్కువ. ఆకుమచ్చ నివారణకు మాంకోజెబ్ 3 గ్రాములు లీటరు నీటిని కలిపి పిచికారీ చేసుకోవాలి.

పంట కోత

దుంపలు ముదిరిన తర్వాత నారింజ రంగుకు మారుతాయి. దీంతో పొలానికి నీరు పెట్టి మరుసటి రోజు ఆకులతో సహా దుంపలను తీసివేయాలి. కోత ఆలస్యం అయితే దుంపల నాణ్యత తగ్గుతుంది. యాజమాన్య పద్ధతులను బట్టి ఎకరానికి 10 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుంది.

సాగులో మెలకువలు

- విత్తనాన్ని ఇసుకతో కలిపి నాటుకోవాలి. విత్తనం, ఇసుక 1:4 నిష్పత్తిలో కలిపి నాటడం మంచిది.
- నత్రజని అధిక మోతాదులో వాడరాదు. అధిక మోతాదులో వాడితే కోత ఆలస్యమై పగుళ్లు ఏర్పడతాయి.
- కాల్షియం లోపంతో దుంపపై నొక్కులు ఏర్పడి నల్లటి మచ్చలు వస్తాయి. దీని నివారణకు కాల్షియం నైట్రేట్ 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పొలాన్ని సరిగ్గా దుక్కి చేయకపోయినా.. సేంద్రియ ఎరువులు వాడకపోయినా దుంప నేలలోకి వెళ్లకుండా చీలిపోతుంది. కాబట్టి దుక్కి జాగ్రత్తగా చేయాలి.

ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు మేలు

- విడతల వారీగా ఆరు గ్యారంటీలు
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ మేలు జరుగుతుందని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విడతల వారీగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. యాచారం మండలంలోని గడ్డమల్లయ్యగూడ, మల్కీజ్‌గూడ, తమ్మలోనిగూడ, మాల్, కిషన్‌పల్లి తదితర గ్రామాల్లో ఆదివారం రూ.రెండున్నర కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో దోపిడీ చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుకుని ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చే పనిలో సర్కారు నిమగ్నమైందన్నారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిందన్నారు. ధరణిలో మార్పులు చేసి తహసీల్దార్ కార్యాలయాల్లోనే భూ సమస్యలు పరిష్కరించేలా ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి ఆధ్వర్యంలో ఓ కమిటీని వేసినట్లు తెలిపారు. గ్రామాల్లోని అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, నిర్మాణాలకు డబ్బులు అందజేస్తామన్నారు. రాష్ట్రంలోనే ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానన్నారు. కాలుష్యం లేని పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య తీర్చుతానన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలాగా భావించి ముందుకు పోతానన్నారు. గడ్డమల్లయ్యగూడ, మల్కీజ్‌గూడ గ్రామాల్లో ప్రజలు అందజేసిన ఫిర్యాదులను తీసుకుని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

మాల్ పశువుల సంతకు స్థలం

మాల్‌లోని పశువుల సంతకు సర్వేనంబరు 640లో 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మాల్‌లోని సాగర్‌రోడ్డు నుంచి పాత మాల్ వరకు సీసీ రోడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, వైస్ ఎంపీపీ శ్రీనువాస్ రెడ్డి, జెడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, పలు శాఖల అధికారులు, గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

సీఐ బదిలీ


ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

హయత్‌నగర్: హయత్‌నగర్ పోలీసు ఇన్‌స్పెక్టర్ హెచ్.వెంకటేశ్వర్లు బదిలీ అయ్యారు. ఆయన ఇక్కడి నుంచి మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ మేరకు రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఈ నెల 26న ఉత్తర్వులు జారీ చేయగా, ఆదివారం ఆయన రిలీవ్ అయ్యారు. సిబ్బంది సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు ఇక్కడ డీఐగా పనిచేసిన ఆర్.నిరంజన్ కూడా బదిలీ చేశారు. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌లు ఇద్దరు ఒకేసారి బదిలీ అయినా.. అధికారులు ఇక్కడ బాధ్యతలు ఎవరికీ ఇవ్వక పోవడం గమనార్హం. ఎస్‌హెచ్‌ఓ బాధ్యతలు ఎవరికి ఇస్తారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

తల్లీకుమారుడి అదృశ్యంపై కేసు నమోదు


షాహిన్ బేగం (ఫైల్)

పహాడీషరీఫ్: ఏడాది వయసున్న కుమారుడితో కలిసి ఓ తల్లి అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాహిన్‌నగర్‌లోని అలీనగర్‌కు చెందిన షాహిన్‌బేగం(25), షేక్ రిజ్వాన్‌లు భార్యభర్తలు. వీరికి ఏడాది వయసున్న కుమారుడు షేక్ ఇర్ఫాన్ ఉన్నాడు. ఈ నెల 24న ఎవరికి చెప్పకుండా కుమారుడితో కలిసి బయటికి వెళ్లిన షాహిన్ బేగం తిరిగి ఇంటికి రాలేదు. స్థానికంగా గాలించినా ఫలితం లేకపోవడంతో రిజ్వాన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62366 నంబర్‌లో సమాచారం అందించాలని కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి


గుంతలో తేలిన మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో క్వారీ గుంతలో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. షాద్‌నగర్ పట్టణంలోని పటేల్ రోడ్డుకు చెందిన శివ(30) క్వారీ గుంతలో పడి శవమై కనిపించాడు. దీన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ దేవకి ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఫైర్ సిబ్బంది సహాయంతో పోలీసులు గుంతలో నీటిపై తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య ఉంది. ఆయన మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. రెండు మూడు రోజుల క్రితమే నీటి గుంతలో పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

నిజాన్ని తట్టుకోలేక మొహం చాటేశారు

కాంగ్రెస్ యువజన రాష్ట్ర కార్యదర్శి అందె మోహన్


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ యువజన నేతలు

షాద్‌నగర్: సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి నిజాలు మాట్లాడినందుకే బీజేపీ నేత డీకే అరుణ మొహం చాటేసారని కాంగ్రెస్‌యువజన రాష్ట్ర కార్యదర్శి అందెమోహన్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాజీ మంత్రి డీకే అరుణ రూ.15 కోట్లు ఇస్తేనే పోటీ చేస్తానని కాంగ్రెస్ పార్టీని సమావేశంలో డిమాండ్ చేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో తాను చేసిన వ్యాఖ్యలకు పూర్తిగా కట్టుబడి ఉండి మహబూబ్‌నగర్‌లోని రామాలయంలో ప్రమాణం చేసేందుకు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి వచ్చారన్నారు. దేవాలయంలో ప్రమాణం చేసే సవాల్‌ను స్వీకరించకుండా డీకే అరుణ మొహం చాటేసారన్నారు. డబ్బులు డిమాండ్ చేసిన విషయం వాస్తవం కాబట్టే ఆమె సవాల్‌ను స్వీకరించేందుకు ముందుకు రాలేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ యువజన నాయకులు ఖదీర్, జాఫర్, గణేశ్, శ్రీకాంత్, నరేశ్, హలీంసాకిబ్, సతీశ్, వంశీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- జెడ్పీ చైర్‌పర్సన్‌తో కలిసి అంగన్‌వాడీ భవనం ప్రారంభం


అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే శంకర్

కొందుర్గు: గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని గుంజల్‌పహాడ్‌లో ఆయన నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలన్నారు. పల్లెలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, అందుకే గ్రామ యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు అభివృద్ధి కోసం ఎంతో కృషిచేశారని.. వారికి అందాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, జెడ్పీటీసీలు స్వరూప, వెంకట్రామ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, సర్పంచ్ జ్యోతి, నాయకులు కృష్ణారెడ్డి, ఆంజనేయులు, రామకృష్ణ, మానయ్య, భాస్కర్, నర్సింలు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మండలంలోని పర్వతాపూర్ గ్రామాన్ని ఎమ్మెల్యే శంకర్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతి, ఎంపీటీసీ మంజుల, నాయకులు మల్లేశ్‌గౌడ్, శ్రీనివాసురెడ్డి, యాదయ్య, రామయ్యగౌడ్, వెంకటనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభ్యులకు అండగా ఉంటాం


నాదర్‌గుల్‌లో ఐక్యత తెలుపుతున్న విశ్వబ్రాహ్మణులు

విశ్వబ్రాహ్మణ సంఘం జాతీయ అధ్యక్షుడు రంగాచారి

బడంగ్‌పేట్: విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు రంగాచారి పేర్కొన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ఆదివారం తోట జంగారెడ్డి గార్డెన్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం 5వ వార్షికోత్సవ ఆత్మీయ సమ్మేళనాన్ని వ్యవస్థాపకులు వెములకొండ జంగాచారి, గన్నోజు రాజుచారి, పులియోజు వెంకటాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం జాతీయ అధ్యక్షుడు రంగాచారి హాజరై మాట్లాడుతూ.. లక్ష రూపాయలతో ఏర్పడిన సంఘం నేడు కోటి రూపాయలకు చేరుకునేలా చేసి, సంఘానికి అండగా విశ్వబ్రాహ్మణులు నిలవడం సంతోషమన్నారు. సంఘం సభ్యులు ఇబ్బందులు పడకూడదనే నిధుల ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం సంఘంలో మరణించిన విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు రూ.4 లక్షల చెక్కులను అందచేశారు. ఇంటి పెద్ద చనిపోతే సంఘం ఆధ్వర్యంలో వితంతు పింఛన్ ఇచ్చేలా ప్రణాళిక చేస్తుండటం సంతోషమన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధన్‌మోహన్‌చారి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌చారి, నాయకులు భిక్షపతిచారి, కృష్ణచారి, ప్రశాంత్, నరేశ్, సురేశ్, బ్రహ్మచారి, రాముచారి, మహేశ్‌చారి పాల్గొన్నారు.

క్వారీలపై హక్కులివ్వాలి

వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కందుకూరు: గుట్టలు, క్వారీలపై పూర్తి హక్కులు వడ్డెర వృత్తిదారులకే ఇవ్వాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మీర్‌ఖాన్‌పేటలో వడ్డెర వృత్తిదారుల సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వారీలన్నీ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి పోయి వడ్డెర వృత్తిదారుల బతుకులు రోడ్డు మీద పడ్డాయన్నారు. వడ్డెర సొసైటీలకు రుణాలు ఇవ్వాలన్నారు. 50 ఏళ్లు నిండిన వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలని కోరారు. వడ్డెర ఫెడరేషన్‌కు చైర్మన్‌ను నియమించి, నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీమా సౌకర్యంతో పాటు అర్హులైన వారికి రేషన్‌కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు విష్ణు, శ్రీనివాస్, స్థానిక నాయకులు వెంకటయ్య, లక్ష్మయ్య, దేవయ్య, శ్రీనివాస్, నరసింహా, రాజు, బుచ్చయ్య, జంగయ్య, విజేందర్, అంజయ్య, శ్రీశైలం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆల్ఫా హోటల్‌కు బాంబు బెదిరింపు

నిందితుడి అరెస్టు

రాంగోపాల్‌పేట్: ఆల్ఫా హోటల్ పరిసరాల్లో బాంబులు ఉన్నాయని పోలీసులకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని మార్కెట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మానికి చెందిన గౌస్ పాషా కూకట్‌పల్లిలోని హ్యాపీ హోటల్‌లో కుక్‌గా పనిచేస్తూ జగద్గిరిగుట్టలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి అతను ఖమ్మం నుంచి 100కు ఫోన్ చేసి సికింద్రాబాద్ ఆల్ఫా హోటల్ పరిసరాల్లో బాంబులు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తులు చర్చించుకుంటున్నారని పోలీసులు వస్తే తాను వారిని చూపిస్తానని చెప్పాడు. దీంతో మార్కెట్ ఎస్సై కిషన్‌యాదవ్‌తో పాటు సీసీఎస్ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ అక్కడికి చేరుకుని హోటల్‌తో పాటు పరిసరాలన్నీ తనిఖీ చేశారు. ఎక్కడ ఎలాంటి అనుమానాస్పద వస్తువులు, బాంబులు కనిపించ లేదు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఖమ్మంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

యువకుడి దారుణ హత్య

పహాడీషరీఫ్: యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మయన్మార్ దేశానికి చెందిన మహ్మద్ ఇబ్రహీం(22) జల్‌పల్లిలోని వాదే సాల్హె హీన్ బస్తీలో చెత్త సేకరిస్తుంటాడు. స్థానికంగా ఉండే ఆసీఫ్ అతనిపై దౌర్జన్యానికి పాల్పడుతూ డబ్బులు వసూలు చేయ సాగాడు. ఆదివారం సాయంత్రం కూడా ఇదే క్రమంలో లాక్కొన్నాడు. ఈ విషయమై తరచూ వేధిస్తుండడంతో ఆగ్రహానికి గురైన ఆసీఫ్ కత్తితో ఇబ్రహీంను కడుపులో పొడిచాడు. స్థానికులు కాపాడేందుకు యత్నించినప్పటికీ అతడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

'ఇవీ మన మూలాలు' పుస్తకావిష్కరణ

పంజగుట్ట: రచయిత కల్లూరి భాస్కరం రచించిన 'ఇవీ మన మూలాలు' గ్రంథంలోని ఒక్కో మాట ఒక ఆణిముత్యమని, దేనికి అదే విశ్లేషింపదగినదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ పుస్తకాన్ని కేవలం చదవడం కాకుండా అధ్యయనం చేయాలన్నారు. ఆదివారం రాత్రి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కల్లూరి భాస్కరం రచించిన ఇవీ మన మూలాలు పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ పాత్రికేయులు, ప్రెస్‌క్లబ్ ప్రధానకార్యదర్శి ఆర్.రవికాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించి మొదటి ప్రతిని సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తికి అందజేశారు. ప్రముఖ సాహితీవేత్త, మాజీ ఐఏఎస్ అధికారి వాడ్రేవు చినవీరభద్రుడు పుస్తక సమీక్ష నిర్వహించగా, రచయిత బీపీ పడాల పుస్తక పరిచయం చేశారు. స్త్రీవాద కవయిత్రి కుప్పిలి పద్మ, రచయిత శ్రీశైల్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు తాడి ప్రకాష్ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ .. ఈ గ్రంథం చదివితే ఎన్నో గ్రంథాలు చదివినట్లవుతుందని ఇందులో రామాయణం, భారతం, వ్యాసుడు, దాశరథి రంగాచార్య , కాళోజీ వరకు అందరి వివరాలు ఉన్నాయన్నారు. రచయిత సంస్కారం సత్యాన్వేషణ ఈ పుస్తకానికి అరుదైన ఆభరణమని కొనియాడారు. ఈ పుస్తకంపై పురాతన శాస్త్రవేత్తలు, సైంటిస్టులు ఆయా రంగాల్లోని నిపుణులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలన్నారు. ఈ పుస్తకం చదవాలనుకునే వారు వాడ్రేవు చిన వీరభద్రుని ముందు మాట ఒకటికి రెండు సార్లు చదవాలని తరువాత ఆర్యులు, అనార్యుల మధ్య జరుగుతున్న ఆధిపత్య భావజాలాన్ని తెలుసుకోవాలన్నారు.